# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-06-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఈ నెల 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శాఖలను కేంద్ర మంత్రి వర్గం ప్రకటించింది.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ శాసనసభ పక్ష సమావేశం ఈరోజు జరుగుతుందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఈఏపీసెట్ పరీక్ష ఫలితాలు ఈ రోజు విడుదల అవుతాయి.**
4. **తెలంగాణలో విద్యారంగాన్ని ప్రోత్సహించేందుకు విద్యాకమిషన్‌ను ఏర్పాటు చేయబోతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు.**
5. **తెలంగాణలో బీఈడీ కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన ఎడ్‌సెట్ ఫలితాలు ఈ రోజు మధ్యాహ్నం విడుదల కానున్నాయి.**

==========================

ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిన్న జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో ఈ నెల 9వ తేదీన ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శాఖలను కేటాయిస్తూ రాష్ట్రపతి కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఇందులో భాగంగా హోం శాఖ మంత్రి గా అమిత్ షా, రక్షణ శాఖ మంత్రిగా రాజనాథ్ సింగ్, రవాణా శాఖా మంత్రిగా నితిన్ గడ్కరీ, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రిగా జగత్ ప్రకాశ్ నడ్డా, వ్యవసాయ గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా శివరాజ్ సింగ్ చౌహాన్, ఆర్థిక శాఖా మంత్రిగా నిర్మలా సీతారామన్, విదేశీ వ్యవహారాల శాఖా మంత్రిగా జైశంకర్, సమాచార, ప్రసారశాఖతో పాటు రైల్వే శాఖా మంత్రిగా అశ్వినీ వైష్ణవ్, మహిళాశిశు సంక్షేమ శాఖా మంత్రిగా అన్నపూర్ణాదేవిలను కేటాయించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన 30 మంది క్యాబినెట్ మంత్రుల్లో 19 మంది గతంలో పని చేసినవారు కాగా అందులో 12 మంది మంత్రులకు పాతశాఖలనే కేటాయించారు.

ఇందులో తెలుగు రాష్ట్రాలకు చెందిన జి.కిషన్‌రెడ్డికి బొగ్గు, గనులశాఖ, రామ్మోహన్ నాయుడికి పౌర విమానయానశాఖ కేటాయించారు. హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్, గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయ మంత్రిగా పెమ్మసాని చంద్రశేఖర్, ఉక్కు, భారీ పరిశ్రమలశాఖల సహాయ మంత్రిగా శ్రీనివాస వర్మలను కేటాయించారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ శాసనసభ పక్ష సమావేశం ఈరోజు జరుగుతుందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ రోజు జరిగే సమావేశంలో టీడీపీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడిని శాసనసభ పక్ష నాయకుడిగా ఎన్నుకుంటారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలైన టిడిపి, జనసేన, బిజెపిలు ఈ రోజు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కలుసుకుని ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని కోరనున్నట్లు టీడీపీ ప్రతినిధి టి. జోత్స్న తెలిపారు. కాగా విజయవాడ గన్నవరం విమానాశ్రయం సమీపంలోని కేశరపల్లిలో ఉన్న ఐటి పార్కు వద్ద రేపు ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుంది.

---

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం ఏర్పాట్లను ఈరోజు సాయంత్రంలోగా పూర్తి చేయాలని రాష్ట్ర రవాణా రహదారులు భవనాల శాఖ ప్రధాన కార్యదర్శి, కార్యక్రమ రాష్ట్ర సమన్వయ అధికారి పి.ఎస్. ప్రద్యుమ్న అధికారులను ఆదేశించారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని ఐటి పార్కు మేధ టవర్స్ సమీపంలో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమం ప్రధాన వేదిక వద్ద అధికారులతో కలసి ఏర్పాట్లను నిన్న పరిశీలించారు. రాష్ట్ర ఉన్నతాధికారులు, రాష్ట్ర పోలీస్ అధికారులు, కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ తదితరులతో కలిసి కార్యక్రమం ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రేపు రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, శాసనసభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు హాజరవుతారని వెల్లడించారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఈఏపీసెట్ 2024 పరీక్షా ఫలితాలను ఈరోజు సాయంత్రం విజయవాడలో విడుదల చేయనున్నట్లు సెట్ ఛైర్మన్ ప్రసాదరాజు తెలిపారు. ఫలితాలను ఈఏపీసెట్ వెబ్ సైట్‌లో చూడవచ్చని తెలిపారు. కాగా ఈ ఏడాది ఈఏపీసెట్‌ను జేఎన్‌టీయూ–కాకినాడ నిర్వహించింది. మొత్తం 3 లక్షల 62 వేల 851 మంది దరఖాస్తు చేయగా.. వారిలో 3 లక్షల 39 వేల 139 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇంజినీరింగ్‌కు సంబంధించి 2 లక్షల 58 వేల 373 మంది, వ్యవసాయ, ఫార్మసీ విభాగాలకు కలిపి 80 వేల 766 మంది పరీక్షలు రాశారు.

---

తెలంగాణలో విద్యారంగాన్ని ప్రోత్సహించడంతోపాటు సమస్యలను పరిష్కరించేందుకు విద్యాకమిషన్ ఏర్పాటు చేయబోతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాల్లో చదివి, పదోతరగతిలో 10 కి 10 జీపీఎస్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు ముఖ్యమంత్రి ప్రతిభాపురస్కారాలు నిన్న అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణలో బడిబాట కార్యక్రమం ద్వారా తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను నిర్వహించడం ద్వారా పేదలకు, వెనుకబడిన వర్గాలకు, గిరిజనులకు విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న సంకల్పంతో పనిచేస్తున్నామన్నారు. డీఎస్సీ ద్వారా త్వరలో 11వేలకు పైగా పోస్టులు భర్తీ చేస్తున్నామని తెలిపారు. 2 వేల కోట్ల రూపాయలను శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహణ పనులు చేపట్టేందుకు కేటాయించామని పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో 2024-25 విద్యా సంవత్సరంలో బీఈడీ కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన ఎడ్‌సెట్ ఫలితాలు ఈ రోజు మధ్యాహ్నం విడుదల కానున్నాయి. ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఛైర్మన్ లింబాద్రి పరీక్ష ఫలితాలను విడుదల చేస్తారని కన్వీనర్ ఆచార్య మృణాళిని ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 23వ తేదీన రెండు విడతల్లో జరిగిన ఎడ్‌సెట్ పరీక్షకు మొత్తం 29 వేల 463 మంది హాజరయ్యారు.

---------------------------

వర్షాకాల నేపథ్యంలో వాహనదారులు తగిన జాగ్రత్తలతో వాహనాలను నడపాలని తెలంగాణ డీజీపీ రవిగుప్త సూచించారు. వర్షాలు పడినప్పుడు భూగర్భ నాలాలను గమనించాలన్నారు. అలాగే వాననీరు వల్ల వాహనాలు జారి పడుతుంటాయని, వర్షం కురుస్తున్నపుడు పరిమిత వేగంతో ప్రయాణించాలని తెలిపారు. వాహనాల్లో ప్రాథమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. వాహనదారులు సరైన జాగ్రత్తలు పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఒక ప్రకటనలో కోరారు

---------------------------

వ్యవసాయ రంగ పట్టభద్రులు, విద్యార్థులు, శాస్త్రవేత్తలు పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా అన్నదాతలకు ఆధునిక వ్యవసాయ ఫలాలు అందించేందుకు కృషి చేయాలని తెలంగాణ ఇన్‌ఛార్జి గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ కోరారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో జరిగిన ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ 6వ స్నాతకోత్సవంలో గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , అత్యధిక జనాభా కలిగిన భారతదేశం ఆహార ఉత్పత్తిలోనూ అగ్రగామిగా ఉందని, దేశంలో ఏటేటా వ్యవసాయోత్పత్తులు గణనీయంగా పెరుగుతున్నాయని తెలిపారు. శాస్త్రవేత్తలు ఇతర దేశాల్లో ఆహార ధాన్యాల సాగు పద్ధతులపై అధ్యయనం చేయాలన్నారు. నీటి సమర్ధ యాజమాన్యం ఉత్పత్తి, ఉత్పాదకతల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

---------------------------

నైరుతి రుతుపవనాలు ఉత్తర అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలకు, మహారాష్ట్రలోని మరికొన్ని ప్రాంతాల్లోకి ప్రవేశించాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో ఈరోజు తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల పడవచ్చుని, ఈదురు గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలియజేసింది. తెలంగాణలో ఈ రోజు రేపు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది.రేపు 20 జిల్లాల్లో ఓ మోస్తరుగా వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ రెండు రోజుల పాటు పసుపు రంగు హెచ్చరికలను జారీ చేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి రాజధాని ప్రాంతంలో పరిశుభ్రతా పనులు వేగంగా సాగుతున్నాయని

రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ–సీఆర్‌డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ తెలిపారు. అమరావతిలో శుభ్రతా పనులను ఆయన నిన్న వివేక్ యాదవ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సుమారు వంద జేసీబీలతో గత నాలుగు రోజులుగా పనులు జరుగుతున్నాయని, 109 కి.మీ నిడివిలోని 673 ఎకరాల విస్తీర్ణంలో పిచ్చి మొక్కలను, కంపలను సిబ్బంది తొలగిస్తున్నారని చెప్పారు.

---------------------------

అన్నమయ్య జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులకు సూచించారు. నిన్న కలెక్టర్ కార్యాలయంలో బాలకార్మికుల నిర్మూలనపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పిల్లలను కార్మికులుగా మార్చకుండా తల్లితండ్రులకు అవగాహన కల్పించాలని ఇందుకోసం తరచూ తనిఖీలను నిర్వహించాలని తెలిపారు. బాలలను పనిలో పెట్టుకున్న వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

======================